

తుక్కుగూడలో జరిగిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మహిళలతో మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి

# అభివృద్ధిని చూసి ఓటేయండి

- తండాలను జీపీలుగా చేసిందే సీఎం కేసీఆర్
- బీజేపీ, కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా చూశాయి
- గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు సత్యవతి రాథోడ్, సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, నవంబర్ 6: రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటేయాలని గిరిజన సంక్షేమశాఖ, విద్యా శాఖల మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. గిరిజన బిడ్డలను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. ఆరు శాతం ఉన్న రిజర్వేషన్‌ను రిజర్వేషన్‌ను 10 శాతానికి సీఎం కేసీఆరే పెంచారని చెప్పారు. మహేశ్వరం మండలం తుక్కుగూడలో సోమవారం నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సత్యవతి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు గిరిజనులను ఇప్పటి వరకు ఓటు బ్యాంకుగానే చూశారని విమర్శించారు. గిరిజనులకు పోడు భూముల పట్టాలను అందించిన ఘనత కూడా సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. రైతు బంధును ఎకరాకు రూ.16 వేలకు పెంచామని, గ్యాస్ సిలిండర్‌కు రూ.400లకే అందించనున్నామని తెలిపారు. సేవాలాల్ భవనానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి రూ.2 కోట్లు ఇచ్చారని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషిచేస్తున్న సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో గిరిజనులకు స్వయం పాలనను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించి, ఆదరించాలని కోరారు. గిరిజన తండాల్లో రోడ్లు, మంచినీటి వసతులను కల్పించామని, తండాల్లోని పంచాయతీలకు పక్కా భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోతు రాజునాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శునకాల విశ్వాసం

- యజమాని కుటుంబాన్ని కాపాడిన కుక్కలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

మానకొండూర్ రూరల్, నవంబర్ 6: ఇంట్లోకి వచ్చిన నాగుపామును రెండు పెంపుడు కుక్కలు చంపి, యజమాని కుటుంబాన్ని కాపాడాయి. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరులో జరిగిన ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన దాసరి అంజయ్య కొన్నేండ్ల నుంచి పప్పి డాగ్స్ (లియో, నానీ)ను ఇంట్లో రక్షణ కోసం పెంచుకుంటున్నాడు. ఇటీవల యజమాని ఇంట్లోకి వస్తున్న నాగుపామును శునకాలు పసిగట్టాయి. ప్రాణాలకు తెగించి దాదాపు 40 నిమిషాలపాటు పాముతో కొట్లాడుతూ కారిచాయి. పాము కూడా శునకాలను కాటేసింది. ఈ పాము, డాగ్స్ కొట్లాటను యజమాని కూతురు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో నెట్టింట్లో వైరల్ అవుతున్నది. పాము చనిపోయాక అపస్మారకస్థితిలోకి వెళ్లిన డాగ్స్‌కు చికిత్స అందించినట్టు యజమాని తెలిపాడు.



కరీంనగర్ జిల్లా ఊటూరులో పామును కరిచి చంపుతున్న కుక్కలు (లియో, నానీ)

# బతికుండగానే వైకుంఠధామం చేరిన అమ్మ

- బాధ్యత మరిచి వదిలేసి వెళ్లిపోయిన కొడుకు
- ఏపీకి చెందిన వృద్ధురాలిగా గుర్తించిన పోలీసులు




మిర్యాలగూడ ఏరియా దవాఖానలో వృద్ధురాలిని పరామర్శిస్తున్న ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ రూరల్, నవంబర్ 6: వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కంటి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకు.. బాధ్యత మరిచి అమ్మను వైకుంఠధామంలో వదిలేసి వెళ్లాడు. నిస్సహాయురాలైన తల్లిని పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు తీసుకొచ్చి ఒంటరిగా విడిచిపెట్టి గుట్టుచప్పుడు కాకుండా జారుకున్నాడు. స్థానికుల సమాచారంతో అధికారులు ఆమెను సర్కారు దవాఖానలో చేర్పించారు. ఈ హృదయవిదారక ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో సోమవారం వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా గామాలపాడుకు చెందిన చింతకుంట్ల వెంకటేశ్వర్లు తన తల్లి వెంకటరత్నమ్మ(70)ను ఆదివారం ఆటోలో తీసుకొచ్చి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంక్ తండా శివారులో ఉన్న వైకుంఠధామంలో వదిలేసి వెళ్లాడు. రాత్రి సమయంలో వైకుంఠధామం వద్ద ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చూసిన గ్రామస్థులు విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. కనీసం నడిచే స్థితిలో కూడా లేని ఆమె పరిస్థితిని గుర్తించి ఆహారం అందించారు. వయోవృద్ధుల శాఖకు సమాచారం ఇవ్వగా.. డీడబ్ల్యూవో కృష్ణవేణి ఆదేశాలతో ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి మునగాల నాగిరెడ్డి వాటర్‌ట్యాంక్ తండాకు చేరుకొని వృద్ధురాలిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. అధికారుల ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ రూరల్ ఎస్సై దోరెపల్లి నర్సింహులు వివరాలు సేకరించి దాచేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. వెంకటరత్నమ్మకు కొడుకు, కూతురు ఉండగా ఏ ఒక్కరూ ఆమెను ఆదరించడం లేదు. తల్లిని భారంగా భావించి.. వైకుంఠధామంలో వదిలేసి వెళ్లారు. పోలీసులు వెంకటేశ్వర్లును పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతడి నుంచి లిఖితపూర్వక హామీ తీసుకొని తల్లిని అప్పగించినట్టు పోలీసులు తెలిపారు. కాగా.. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ ఏరియా దవాఖానకు వెళ్లి వృద్ధురాలిని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.


తెలంగాణ ప్రభుత్వము, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ
జిల్లా బాలల పరిరక్షణ విభాగం

ప్రకటన సంఖ్య: 275-17/2023 | ప్రకటన | తేది: 03-11-2023



ఇందు వెంట జతపరచబడిన శిశువు (బాలిక) జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, నల్లగొండ కార్యాలయము నందలి, నల్లగొండ శిశుగృహ నందుంచబడినది. అసలు తల్లిదండ్రులు బాలికని క్లయిమ్ చేయుటకు రుజువులతో సహా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 120 రోజులలో దిగువ సంతకందారును సంప్రదించవలయును. లేనిచో ఈ పాపను వదిలి వేయబడినదిగా ప్రకటించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తతకు ఇవ్వబడును. వివరాల కొరకు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, నల్లగొండ వారి కార్యాలయము, న్యూ కలెక్టరేట్, మాధవ రెడ్డి భవనము, నల్లగొండ 08682-245983, 232566 నందు సంప్రదించవలయును. పాప వివరములు. సుమారు 3 సంవత్సరాల పాప.

సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగ మరియు వృద్ధుల శాఖ, నల్లగొండ
DIPR RO.No. 2124-DP/CL/ADVT/1/2023-24, Dt: 06-11-2023







## 11న గిరిజన ఆత్మగౌరవ సభ: సత్యవతి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గిరిజన ఆత్మగౌరవ సభ ఈ నెల 11న నిర్వహించనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. శామీర్‌పేటలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సభ నిర్వహిస్తామని సోమవారం తెలంగాణభవన్‌లో మీడియాకు వెల్లడించారు. ఈ సభకు గిరిజన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి మంత్రులు కేటీఆర్, టీ హరీశ్‌రావు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీఆర్ఎస్ కార్యదర్శి రూప్‌సింగ్, కరాటే రాజు, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మెంబర్ రాంబాల్‌నాయక్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, మీర్‌పేట మేయర్ దీప్‌లాల్‌నాయక్, బోడుప్పల్ కార్పొరేటర్ సుమన్‌నాయక్, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక పోలీసులకు పోలింగ్ విధులు వద్దు

- ఓటింగ్ ప్రసారాలపై నిరంతర పర్యవేక్షణ
- చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వికాస్‌రాజ్



హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): పోలింగ్ కేంద్రాల వద్ద స్థానికంగా విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి డ్యూటీలు వేయొద్దని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాజ్‌రాజ్ సూచించారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు చెందిన పోలీస్ నోడల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను వివరించారు. రాజకీయ కార్యక్రమాలను వీడియోలు తీయడంపై అన్ని వీడియో నిఘా బృందాలకు శిక్షణ ఇవ్వాలని, అయితే వారు మొబైల్ ఫోన్లతో కాకుండా కచ్చితంగా కెమెరాలతోనే చిత్రీకరించాలని పరిశీలకులు సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి, పెండింగ్‌లో ఉన్న అన్ని 6వ నంబరు ఫారాలను నవంబర్ 10 లోగా పరిష్కరించాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి అజయ్ వీ నాయక్, మాజీ ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా, ప్రత్యేక వ్యయ పరిశీలకుడు రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి బాలకృష్ణన్ పాల్గొన్నారు.

### వాస్తవ వార్తలు ప్రసారయ్యేలా చూడాలి

పోలింగ్ రోజున ఏదైనా ప్రతికూల వార్త ప్రసారమైతే నోడల్ అధికారి వెంటనే వాస్తవ వివరాలను తెలుసుకొని, వాటిని తిరిగి సంబంధిత ఛానళ్లకు తెలియచేసి వాస్తవ సమాచారం ప్రసారమయ్యేట్టు చూడాలని అధికారులకు సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారి సామర్థ్యం మేరకు పని చేయాలని డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ అజయ్ బాదూ, ఆదేశించారు. పంకజ్ శ్రీవాస్తవ్, డైరెక్టర్, ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్ మధ్యాహ్నం సీఈవో కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సీనియర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.

## టీఎస్ఎంసీ ఎన్నికల బ్యాలెట్ పంపిణీ పూర్తి

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పేపర్ల పంపిణీ పూర్తయిందని అధికారులు తెలిపారు. డాక్టర్ల అడ్రస్‌కు రిజిస్టర్ పోస్టు చేసినట్టు చెప్పారు. ఎవరికైనా అందకపోతే డూప్లికేట్ బ్యాలెట్ పేపర్ల కోసం ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకుంటే పంపనున్నట్టు వెల్లడించారు.

## 211 నామినేషన్లు దాఖలు

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా సోమవారం 211 నామినేషన్లు నమోదయ్యాయి. వివిధ నియోజకవర్గాల నుంచి అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు, ఇండిపెండెంట్లుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, ధర్మపురి, నిజామాబాద్ రూరల్, రామగుండం, చొప్పదండి, వేములవాడ, మెదక్, నర్సాపూర్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, మహేశ్వరం, చేవెళ్ల, జూబ్లీహిల్స్, చార్మినార్, నారాయణ పేట, మక్తల్, వనపర్తి, గద్వాల, ఆలంపూర్, షాద్‌నగర్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో సోమవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అధికారులు తెలిపారు.

## ముమ్మరంగా తనిఖీలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేసి నగదు, అక్రమ మద్యం పట్టుకొంటున్నాయి. సోమవారం హైదరాబాద్ జిల్లాలో రూ.1,63, 300ల నగదును సీజ్ చేశాయి. ఇప్పటివరకు రూ.3,49,75,450 నగదును సీజ్ చేసినట్టు ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. పోలీస్ అథారిటీ ద్వారా రూ.1, 82,85,265ల నగదు సీజ్ చేశామన్నారు. ఇప్పటికీ రూ.48,83, 66,411 నగదును సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. 600 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.